సాక్షి
జగిత్యాల
సోమవారం। 4। సెప్టెంబర్। 2023

గంగమ్మకు పూజలు

మల్యాల : ముత్యంపేట గ్రామంలో ఆదివారం గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠాన ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇటీవల నిర్మించిన ఆలయంలో వేద పండితులు సంతోష్‌శర్మ, ప్రణీత్‌శర్మ, ఉమా మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు చేశారు. హనుమాన్ ఆలయంలో శివలింగాన్ని ప్రతిష్ఠించారు. సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

ఇందిరమ్మ ఇళ్లతో భారం మోపిన కాంగ్రెస్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలటౌన్: బ్యాంకు రుణాలు ఇప్పించి, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పేదలపై రుణ భారం మోపిన కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే హక్కులేదని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ సీఎంలు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పేదలను రుణగ్రస్తులను చేశారని, కేసీఆర్ సీఎం అయ్యాక రూ. 3,900కోట్ల ఇందిరమ్మ ఇళ్ల రుణాలు మాఫీ చేసి పేదలను రుణ విముక్తి చేశారని గుర్తుచేశారు. దీంతో సీఎం కేసీఆర్‌కు ప్రతీఇందిరమ్మ ఇంటా భాగస్వామ్యం ఉందన్నారు. వాస్తవానికి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఓట్లు అడిగే హక్కు బీఆర్‌ఎస్ పార్టీకే ఉందని సంజయ్ అన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆబ్కారీ మంత్రిగా పనిచేసినప్పుడు లిక్కర్ ఎందుకు నిషేధించలేదని ప్రశ్నించారు. లిక్కర్ విక్రయాలపై అధిక ఆదాయం వస్తుందంటున్న కాంగ్రెస్ నాయకులు.. ఆ పార్టీ అధినేత సోనియాగాంధీపై ఒట్టేసి లిక్కర్ మానేసి మాట్లాడాలని సలహా ఇచ్చారు. నాయకులు బాలె శంకర్, వొల్లం మల్లేశం, జుంబర్తి శంకర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.


పరిశోధనలు వేగవంతం



నివాళి అర్పిస్తున్న శాస్త్రవేత్తలు

జగిత్యాలఅగ్రికల్చర్: వ్యవసాయ పరిశోధనలను వేగవంతం చేస్తున్నామని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం ఇన్‌చార్జి డైరెక్టర్ శ్రీలత అన్నారు. పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో ఆదివారం వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవిర్భావ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. తొలుత ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పడిన 9 ఏళ్లలో వ్యవసాయ రంగంలో అనేక అద్భుతాలు సాధించిందన్నారు. వరి, పత్తి, కంది, సోయా చిక్కుడు, వేరుశెనగ వంటి విత్తనాలు రూపొందించామని చెప్పారు. శాస్త్రవేత్తలు బలరాం, స్వాతి, సూపరింటెండెంట్ పురుషోత్తం రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూమేశ్వర్‌కు పురస్కారం



అవార్డు అందుకుంటున్న భూమేశ్వర్

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): మెట్లచిట్టాపూర్ గ్రామానికి చెందిన రాజారపు భూమేశ్వర్ ఉత్తమ రైతు పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లో ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం తొమ్మిదో వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా భూమేశ్వర్‌కు ఉత్తమ రైతు పురస్కారం అందించి అభినందించారు. పంటల సాగులో వినూత్న పద్ధతులు అవలంబిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నందుకు ఆయనకు ఈ పురస్కారాన్ని అందించారు.

బియ్యం.. నాసిరకం!

- ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల తనిఖీలతో వెలుగులోకి
- పాతవాటినే కొత్త బియ్యంగా చూపుతున్న రైస్‌మిల్లర్లు
- నాచుపల్లి గోదాముల్లోనూ బయటపడ్డ నిజాలు
- బాధ్యులపై చర్యలకు జిల్లా అధికారుల వెనుకడుగు



గోదాములో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు(ఫైల్)

జగిత్యాలరూరల్: జిల్లాలోని కొందరు రైస్‌మిల్లర్లు భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ)కు నాసిరకం బియ్యం అప్పగిస్తున్నారు. రాష్ట్రస్థాయి విజిలెన్స్ బృందాల తనిఖీల్లో ఈ నిజాలు బహిర్గతం కావడంతో జిల్లా అధికారులు అయోమయంలో పడ్డారు. నిజానికి ఐకేపీ, సహకార సంఘాల ద్వారా పౌరసరఫరాల అధికారులు ఏటా రెండు సీజన్లలో రైతుల నుంచి ధాన్యం సేకరిస్తున్నారు. దీనిని రైస్‌మిల్లర్లకు అప్పగించి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎమ్మార్)గా మార్చి ఎఫ్‌సీఐకి అందజేస్తున్నారు. ఇక్కడే కొందరు మిల్లర్లు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. మర ఆడించిన బియ్యాన్ని గోదాములకు తరలిస్తున్న సమయంలో పాత బియ్యాన్ని కూడా కొత్తవిగా చూపుతున్నారు.

కేసులు నమోదైనా మారని తీరు..

- జిల్లాలో 2022లో పౌర సరఫరాలు, విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ అధికారులు పలు రైస్‌మిల్లుల్లో చాలాసార్లు తనిఖీలు చేశారు.
- నిబంధనలు అతిక్రమించిన వారిపై 133 కేసులు నమోదు చేశారు. వారినుంచి 4,734 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు.
- గత జనవరి నుంచి ఇప్పటివరకు 26 కేసులు నమోదు చేసి 275 క్వింటాళ్ల బియ్యం, 4,500 క్వింటాళ్ల ధాన్యం స్వాధీనం చేసుకున్నారు.

బయటపడుతున్న నిజాలు..

గతనెల 28న కొడిమ్యాల మండలం నాచుపల్లి శివారు ప్రభుత్వ గోదాముల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిల్వచేసిన అనుమానాస్పద బియ్యాన్ని సీజ్‌చేశారు. శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించారు.

నిబంధనలకు విరుద్ధంగా నిల్వలు..

- నాచుపల్లి ప్రభుత్వ గోదాము పర్యవేక్షణాధికారులను మిల్లర్లు మచ్చిక చేసుకుని పాత వాటినే కొత్త బియ్యంగా అప్పగించారని విజిలెన్స్ తనిఖీల్లో తేలింది.
- 2021–22కి భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) నిబంధనల ప్రకారం రైస్‌మిల్లర్లు పంపించిన రైస్‌బ్యాగ్‌పై బ్లూకలర్ దారం ఉండాలి.
- చాప ప్రింటింగ్, స్టిక్కర్, కన్‌సైన్‌మెంట్ నంబరు వేయాలి.
- అయితే, ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీల్లో అవేమీ కనిపించలేదు.
- వాటిని పాత బియ్యంగానే పరిగణించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు.. రాజకీయ ఒత్తిళ్లతో వెనుకంజ వేస్తున్నారని తెలిసింది.
- 2022–23లో మిల్లర్లు తమ బ్యాగులకు రెడ్‌కలర్ దారం, రెడ్‌కలర్ చాప ప్రింటింగ్, రెడ్‌కలర్ స్టిక్కర్, కన్‌సైన్‌మెంట్ నంబరు బ్యాగ్‌పై వేయాలి.
- మొన్నటి తనిఖీల్లో ఇవేమీ కనిపించలేదు. దీంతో అక్కడ జరుగుతున్న అవినీతి బయటపడింది.
- నిబంధనల ప్రకారం.. బియ్యం రీసైక్లింగ్‌ను అరికట్టేందుకు ఒక ఏడాది ఒక కలర్ దారం, చాప, స్టిక్కర్, మరో ఏడాది మరో కలర్ దారం, చాప ప్రింటింగ్, స్టిక్కర్ ఉండాలి.
- చాలామంది మిల్లర్లు గోదాముల్లోని అధికారులను మచ్చిక చేసుకుని నిబంధనలకు విరుద్ధంగా బియ్యం అప్పగిస్తున్నారు.

రాజకీయ ఒత్తిళ్లు..

నాచుపల్లి గోదాముల్లో అనుమానాస్పద బియ్యం సరఫరా చేసిన మిల్లర్లపై చర్యలు తీసుకోవడంలో అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. తమపై చర్యలు తీసుకోకుండా మిల్లర్లు అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు తెస్తున్నారని తెలిసింది.

కేసులు నమోదు చేస్తున్నాం



నిబంధనలు పాటించని రైస్‌మిల్లర్లపై చర్యలు తీసుకుంటున్నాం. కొడిమ్యాల మండలం నాచుపల్లి గోదాముల్లో తనిఖీలు చేయగా అనుమానిత బియ్యం లభించాయి. వాటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు తరలించాం. నివేదికలు రాగానే చర్యలు బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వర్‌రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి

చందనను ట్రాప్ చేశారా?

- నగలు, నగదు కోసమే హతమార్చారా?
- దీప్తి హత్యోదంతంపై అనుమానాలు

కోరుట్ల: ఇంట్లో నగలు, నగదు ఉన్న సమయంలోనే ప్రియుడితో కలిసి పరార్ కావాలన్న ఆలోచన చందనకు ఎవరు కల్పించారు? ఈ దిశలో ఆమెను ఎవరైనా గైడ్ చేశారా? ప్రేమ మోజులో ఆ యువతి వారి ట్రాప్‌లో పడిపోయిందా? ప్రియుడితో కలిసి వెళ్లకుండా అడ్డుకున్న అక్కను చివరకు హతమార్చే పరిస్థితికి దిగజారిందా? అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. గతనెల 29వ తేదీ వేకువజామున పట్టణంలోని భీమునిదుబ్బలో ప్రియుడు ఉమర్ షేక్‌తో కలిసి చందన తన అక్క దీప్తిని సినీ ఫక్కీలో హత్యచేసిన కేసులో వెలుగులోకి వస్తున్న కోణాలు ఆసక్తి రేపుతున్నాయి.

నాలుగేళ్ల పరిచయం..

- 2019లో చందన బీటెక్ చదవడం కోసం హైదరాబాద్ మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో చేరింది.
- తన కంటే ఒక ఏడాది సీనియర్ ఉమర్ షేక్ సుల్తాన్ డిటెయిన్ కావడంతో చందనకు పరిచయం అయ్యాడు.
- అప్పటినుంచి వీరి ప్రేమాయణం సాగుతున్నట్లు సమాచారం.
- హాస్టల్‌లో ఉంటూ చందన తరచూ ఉమర్ షేక్ సుల్తానా ఇంటికి వెళ్లివస్తుండేదని తెలిసింది.
- ఈక్రమంలో వీరి ప్రేమ వ్యవహారం కొన్నాళ్లకు దీప్తికి తెలిసింది.
- ఆ తర్వాత ఇంట్లోనూ అందరికీ తెలిసి ఇంట్లో గొడవలు జరిగినట్లు సమాచారం.
- దీంతో చందన తండ్రి శ్రీనివాస్‌రెడ్డి తన కూతుళ్లు దీప్తి, చందనకు వివాహాలు చేయాలని సన్నాహాలు ప్రారంభించారు.
- ఆయన ఆంధ్రాకు చెందిన వ్యక్తి కావడంతో అక్కడే సంబంధాలు చూస్తున్నారు.
- పెళ్లి చేసుకోవాలని ఇంట్లో పెరుగుతున్న ఒత్తిడి గురించి చందన తన ప్రియుడికి చెప్పినట్లు సమాచారం.
- అయితే, 'మనకు జాబ్ లేదు.. ఎలాబతుకుతాం' అని డబ్బు, నగలు తీసుకొచ్చేలా ఉమర్ షేక్.. చందన దృష్టి మళ్లించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కోరుట్లకు వచ్చే విషయం ఇంట్లో తెలుసు!

గతనెల 28వ తేదీన ఉదయం హైదరాబాద్ నుంచి కోరుట్లకు బయలుదేరిన విషయాన్ని ఉమర్ షేక్ తన తల్లి ఆలియా, చెల్లె ఫాతిమాకు చెప్పినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అయితే, ఆ యువకుడు, అతడి కుటుంబానికి చందనపై ప్రేమే ఉంటే నగలు, డబ్బు అవసరం లేదని చెప్పి ఉండవచ్చు కదా? అనే సందేహాలు వేధిస్తున్నాయి. సోమవారం రాత్రి దీప్తి మద్యం మత్తులో ఉన్న సమయంలో చందన, ఉమర్ కలిసి నగలు, డబ్బు సర్దే పనిచేయకుండా చడీచప్పుడు కాకుండా పరారై ఉంటే.. దీప్తి హత్యకు ఆస్కారం ఉండేది కాదనే అభిప్రాయాలు ఉన్నాయి. ఉమర్ షేక్ తల్లి గతంలో లెక్చరర్‌గా పనిచేసినట్లు సమాచారం. విద్యాధికులైన అతడి కుటుంబీకులు.. చందన, ఉమర్ కలిసి మంగళవారం నగలు, డబ్బులతో కారులో హైదరాబాద్ చేరుకోగానే.. ఇది తప్పని చెప్పి పోలీసులకు సమాచారం ఇవ్వలేదు. అంతేకాకుండా అంతాకలిసి నగలు, డబ్బులతో తప్పించుకునే ప్రయత్నం చేయడం.. చందనను గుర్తుపట్టకుండా బుర్కా వేసి కారులో తీసుకెళ్లడం.. టోల్‌గేట్లకు చిక్కకుండా అడ్డదారుల్లో పయనించడం.. ఇదంతా పక్కా ప్రణాళిక ప్రకారం జరిగిందన్న అభిప్రాయాలకు ఊతమిస్తోంది.

రిమాండ్‌కు నిందితులు..

దీప్తి హత్య, డబ్బులు, నగలు ఎత్తుకెళ్లిన కేసులో నిందితులు బంక చందన, ఆమె ప్రియుడు ఉమర్‌షేక్ సుల్తానా, ఇతడి తల్లి ఆలియా, చెల్లి ఫాతిమాతో పాటు బంధువు హఫీజ్‌ను ఆదివారం మధ్యాహ్నం జడ్జి వద్ద పోలీసులు హాజరుపరిచారు. జడ్జి ఆదేశాల మేరకు 14 రోజుల పాటు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. నిందితులపై ఐపీసీ 302, 201, 120(బీ),380 సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని ఆయన వివరించారు.

బ్రెయిన్ వాష్ చేసింద్రు



నా బిడ్డ చందనను ఉమర్ ఫ్యామిలీ ట్రాప్ చేసింది. కొంతకాలంగా ఉమర్ కుటుంబ సభ్యులతో నా బిడ్డ టచ్‌లో ఉన్నవిషయం నాకు తెలియదు. తెలిస్తే వెంటనే కట్టడి చేసేవాన్ని. ఉమర్ ఫ్యామిలీ బ్రెయిన్‌వాష్ చేసింద్రు. నగలు, డబ్బుల కోసం ప్లాన్ చేసింద్రు. నిజంగా నా బిడ్డపై ప్రేమ ఉంటే నగదు, నగలు ఎందుకు ఎత్తుకెళ్లారు? దీప్తి కనీసం ఇంట్లో చాయ్ కూడా తాగదు. అలాంటిది వొడ్కా తాగిందని చందన చేత ఉమర్ ఫ్యామిలీ వాయిస్ మెసేజ్‌లో చెప్పించింది. ఇదంతా తప్పు. ప్రేమ పేరిట చందనను ట్రాప్ చేసి దీప్తి చావుకు కారణమైన వాళ్లకు కఠిన శిక్ష పడాలి.

– శ్రీనివాస్‌రెడ్డి



కోరుట్లలో కారుమబ్బులు

వానజోరు

కోరుట్ల/కొండగట్టు/వెల్గటూర్: జిల్లా వ్యాప్తంగా శనివారం సాయంత్రం నుంచి ఆదివారం రాత్రి వరకూ వర్షం ఏకధాటిగా కురిసింది. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో కోరుట్లలో చీకట్లు కమ్ముకున్నాయి. కొడిమ్యాల మండలం కోనాపూర్‌లో మృతి చెందిన వృద్ధురాలు కట్ల జగ్గవ్వ అంత్యక్రియల వాహనం వాగులో నిలిచి పోవడంతో గ్రామస్తులు అప్రమత్తమై ఒడ్డుకు చేర్చారు. వెల్గటూర్‌లో రోడ్డుపై చెట్టు విరిగిపడి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



కోనాపూర్ వాగుపై వరద ఉధృతి



వెల్గటూర్‌లో రోడ్డుపై విరిగిపడ్డ చెట్టు

ఒక ఠాణా.. నలుగురు ఎస్సైలు

- జిల్లాలోనే కోరుట్ల పోలీసుస్టేషన్ స్పెషల్
- వరుస ఘటనలతో అధికారుల అప్రమత్తం



కోరుట్ల పోలీస్‌స్టేషన్

కోరుట్ల: నిన్నామొన్నటి దాకా ఒకరిద్దరే ఉన్న కోరుట్ల ఠాణాలో ప్రస్తుతం నలుగురు సబ్ ఇన్స్‌పెక్టర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. అతిపెద్దదైన జిల్లా కేంద్రంలోనే నలుగురు ఎస్సైలు లేరు. ఇటీవల నలుగురు ఎస్సైలను కోరుట్లలో నియమించారు. పట్టణంలో వరుసగా చోటుచేసుకుంటున్న నేరాలు, పెరుగుతున్న పెండింగ్ కేసులతో అప్రమత్తమైన పోలీసు శాఖ.. శాంతిభద్రతలకు విఘాతం కలుకుండా ఇప్పటి వరకు ఉన్న ఒక ఎస్సైకి తోడుగా రెండు నెలల క్రితం ఓ ఎస్సైకి పోస్టింగ్ ఇచ్చింది. వారంక్రితం.. మరో ఇద్దరు ఎస్సైలను అటాచ్ చేసినట్లు తెలిసింది.

వరస నేరాలు..

- పట్టణంలో గత ఏప్రిల్‌లో యువకుడు ఠాకూర్ ప్రవీణ్‌సింగ్ హత్య జరిగింది.
- నెలక్రితం మరో వ్యక్తి సమీర్‌ను కొందరు చంపి కాలువలో పడేశారు.
- ఇరవై రోజుల క్రితం బీఆర్‌ఎస్ కౌన్సిలర్ భర్త పోగుల లక్ష్మీరాజం హత్యకు గురయ్యారు.
- ఐదురోజుల క్రితం భీమునిదుబ్బలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దీప్తి హత్య చోటుచేసుకుంది.
- దీంతో పరిస్థితిని చక్కదిద్దడం, శాంతిభద్రతలను కాపాడటంపై ఉన్నతాధికారులు ప్రణాళిక రూపొందించినట్లు తెలిసింది.
- ఈక్రమంలోనే కోరుట్ల ఠాణాపై ప్రత్యేక దృష్టి సారించి, మరింత పోలీసు సిబ్బంది అవసరం ఉందని గుర్తించినట్లు సమాచారం.
- దీంతో ఠాణా మొదటి ఎస్సై కిరణ్‌కు తోడు రెండు నెలల క్రితం రెండో ఎస్సైగా ఇంద్రకరణ్‌రెడ్డిని నియమించారు.
- ప్రస్తుత వరుస సంఘటనలతో ఎస్సైలు శంకర్, ఆరీఫొద్దీన్‌ను వారం క్రితం కోరుట్ల ఠాణాకు అటాచ్ చేయడం గమనార్హం.

పెండింగ్ దరఖాస్తులూ ఎక్కువే..

సుమారు లక్ష లోపు జనాభా ఉన్న పట్టణంతోపాటు మండలంలోని 14 గ్రామాలకు ఒకేపోలీస్‌స్టేషన్ ఉంది. దీంతో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, రోజువారీ దరఖాస్తుల పరిష్కారం అధికారులకు సమస్యగా మారింది. ప్రస్తుతం కోరుట్ల పోలీసుస్టేషన్‌లో సుమారు 120 నుంచి 150 కేసుల దాకా పెండింగ్ ఉన్నట్లు సమాచారం. పోలీసు సిబ్బంది సంఖ్య దజను లోపుగా ఉండటం, ప్రతీరోజు సుమారు 12–15 దరఖాస్తులు వస్తుండటంతో వాటి పరిష్కారంలో తీవ్రమైన జాప్యం జరుగుతోంది. వీటి పరిష్కారం, ఇతర నేరాల నియంత్రణకు అవసరమైన సిబ్బంది అందుబాటులో లేకపోవడం సమస్యగా మారింది. ఈ క్రమంలో జిల్లా కేంద్రానికి ఇటీవల ఇతర జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన ముగ్గురు ఎస్సైలను కోరుట్లకు అటాచ్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

'ఆరుతడి'కి జీవం

- పత్తి, మొక్కజొన్నకు ప్రాణం
- సోయాబిన్ పంటకు రక్ష
- జిల్లాలో జోరు వానలు
- అన్నదాతల్లో ఆనందం

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో గత ఆగస్టులో వర్షాలు పెద్దగా కురవలేదు. వర్షాధారంగా సాగు చేసిన పత్తి, మొక్కజొన్న, సోయాబిన్ తదితర ఆరుతడి పంటలకు నీళ్లు అందలేదు. అయితే, శనివారం సాయంత్రం నుంచి కురుస్తున్న వర్షాలు ఈ పంటలకు జీవం పోస్తున్నాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

50 మి.మీ. వర్షపాతం నమోదు..

- జిల్లాలో గత శని, ఆదివారాల్లో దాదాపు 40 మి.మీ. నుంచి 50 మి.మీ. వర్షపాతం నమోదైంది.
- మరోరెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని పొలాస వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు.
- ఇప్పటివరకు నేలలో తగినంత తేమ లేక వాడిపోయిన ఆకులతో నీరసించిన ఆరుతడి పంటలు ప్రస్తుతం అందుతున్న నీళ్లతో చిగురిస్తున్నాయి.
- జిల్లాలో పత్తి 20 వేల ఎకరాలు, మొక్కజొన్న 45 వేల ఎకరాల్లో పండిస్తున్నారు.
- ప్రధానంగా పత్తి పూర్తిగా వర్షాధార పంట. వానలు సమృద్ధిగా కురిస్తేనే మొక్క ఎదుగుతుంది. పూతవచ్చి, పిందె, కాయ కాస్తుంది.
- ఈ ప్రక్రియ జరిగే సమయంలోనే వానలు ముఖం చాటేశాయి.



జగిత్యాల పట్టణ శివారులో సాగవుతున్న పత్తి

- దీంతో పంటలో పునరుత్పత్తి ప్రక్రియ ఆగిపోయిందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.
- నేల నుంచి మొక్కలు ఆహారం తీసుకునే పరిస్థితి లేకుండా పోయింది.
- గత జూలైలో కురిసిన భారీవర్షాలు మొక్కల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపాయి.

కలుపు తీస్తూ..

నేల తేమగా ఉంటేనే పంటలో కలుపు ఏరివేయడం సాధ్యమవుతుంది. వర్షాలు కురవక నేల గట్టిగా మారింది. కలుపు మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో ఎకరం పత్తి కలువడానికి సుమారు నలుగురికి బదులు రెట్టింపు కూలీలు అవసరమయ్యారు. రైతులపై కూలి భారం పెరిగినా ఆశించిన స్థాయిలో కలుపు పనులు జరుగలేదు. పత్తి నాటిన 30, 60, 90, 120 రోజులకోసారి రసాయన మందు వేయాలి. వర్షాలు లేక నేలలో కరుగదనే ఉద్దేశంతో చాలా మంది రైతులు ఎరువులు వేయలేదు. ఇప్పుడు, వర్షాలు కురుస్తుండటంతో కలుపు మొక్కలు ఏరివేసి, ఎరువులు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

దిగుబడిపై ప్రభావం..

- సమయానుకూలంగా యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆశించిన దిగుబడి వస్తుంది.
- ఈసారి ఒకేసారి వానలు భారీగా కురుస్తుండటం, ఆ తర్వాత నెలపాటు పత్తా లేకుండా పోవడంతో వాతావరణంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి.
- ఇవి పంటలపై ప్రభావం చూపిస్తున్నాయి.
- పత్తి ఎదుగుదల అంతంతమాత్రంగానే ఉంది. ఇప్పటికే పేనుబంక, రసం పీల్చే పురుగు ఆశించాయి.
- దీనికితోడు పిందె నుంచి కాయగా మారే దశలోనే పిందెలు రాలిపోతున్నాయి.
- పత్తిని ఆశించే పురుగు, తెగుళ్లను అరికట్టేందుకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాల్సి ఉంటుంది.
- కానీ, వాతావరణ మార్పులు ఆ పనులకు ఆటంకంగా మారాయి.
- దీంతో ఎకరాకు సుమారు 10 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి వస్తుందని ఆశిస్తే.. ప్రస్తుత పరిస్థితుల్లో ఐదు క్వింటాళ్లు కూడా వచ్చే అవకాశం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వర్షాలు లేక ఇబ్బందులు



నల్లరేగడి నేలల్లో పత్తి సాగు చేస్తాం. జూలైలో కురిసిన వర్షాలే కానీ.. ఆగస్టులో కురవలేదు. నేల గట్టి పడింది. కలుపు తీసేసే పరిస్థితి లేకుండా పోయింది. రసాయన ఎరువులు కూడా వేయలేదు. ఇప్పుడు కురుస్తున్న వర్షాలతో యాజమాన్య పద్ధతులు చేపడతాం.

– రాజలింగు, పత్తి రైతు, బీంరాజ్‌పల్లి

పత్తికి అనుకూలం



రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలు పత్తితోపాటు ఆరుతడి పంటలకు అనుకూలంగా మారాయి. వాతావరణ మార్పులతో మొక్కలో అనేక మార్పులు సంభవించాయి. పూత, కాయ సరిగ్గా నిల్వలేదు. ప్రస్తుత వర్షాలతో మొక్కలకు జీవం వచ్చినట్లయ్యింది.

– సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

ఆలయంలో చోరీ



ఆలయం వద్ద డాగ్‌స్క్వాడ్ తనిఖీలు

వెల్గటూర్(ధర్మపురి): మండల కేంద్రంలోని శ్రీరామ భక్తాంజనేయ శివలింగ దేవాలయంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు హనుమాన్, శివాలయాల్లోని హుండీలు పగులగొట్టి, నగదు ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం గమనించిన అర్చకుడు నరసింహస్వామి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై శ్వేత ఘటనాస్థలికి చేరుకొని, పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం వారు వచ్చి, ఆధారాలు సేకరించారు. హుండీల్లో సుమారు రూ.5 వేల వరకు ఉన్నట్లు అర్చకులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మేకల మృతి



మృతిచెందిన మేకల వద్ద మల్లయ్య

కోరుట్ల రూరల్: మండలంలోని జోగిన్‌పెల్లిలో విద్యుదాఘాతంతో పంచత మల్లయ్యకు చెందిన రెండు మేకలు మృతి చెందాయి. వివరాల్లోకి వెళ్తే.. మల్లయ్య ఎప్పటిలాగే ఆదివారం తన మేకలను మేత కోసం గ్రామ శివారులోని గుట్ట వద్దకు తీసుకెళ్లాడు. రెండు జీవాలు అక్కడున్న ట్రాన్స్‌ఫార్మర్ గద్దెపైకి ఎక్కాయి. విద్యుదాఘాతం సంభవించడంతో అక్కడే మృతి చెందాయి. తనకు రూ.30 వేల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

అర్ధరాత్రి రేకుల షెడ్డు కూల్చివేత

- పరస్పర దాడుల్లో పలువురికి గాయాలు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో శనివారం అర్ధరాత్రి రేకులషెడ్డు కూల్చివేసిన ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఇరువర్గాల పరస్పర దాడుల్లో పలువురికి గాయాలైనాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. చెర్లభూత్కూర్ శివారులో బీఆర్‌ఎస్ నాయకుడు ఆకుల కిరణ్ వారం రోజుల నుంచి రేకులషెడ్డు నిర్మిస్తున్నాడు. షెడ్డు నిర్మాణంతో తమ పొలాల్లోకి దారి లేకుండా పోతుందని కరీంనగర్‌కు చెందిన భూయజమాని అడ్డుకోగా ఇరువురి మధ్య వివాదమేర్పడింది. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి భూ యజమాని ఆధ్వర్యంలో పలువురు వ్యక్తులు జేసీబీతో వచ్చి నిర్మాణంలో ఉన్న షెడ్డును కూల్చివేశారు. సమాచారం అందుకున్న కిరణ్ తండ్రి తిరుపతితో అక్కడికి వచ్చి అడ్డుకోగా ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొంది. ఒకరిపై ఒకరు భౌతిక దాడులకు దిగడంతో పలువురు గాయపడ్డారు. అక్రమంగా షెడ్డు కూల్చివేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆదివారం కిరణ్ తండ్రి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు.

దివ్యాంగుల ఖాతాలో రూ.4,016

- పెరిగిన రూ.1,000 పింఛన్
- జిల్లాలో 17,405 మందికి లబ్ధి

పెగడపల్లి: దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం మరింత తోడ్పాటునందించింది. వారికి ఇచ్చే పింఛన్‌ను రూ.3,016 నుంచి రూ.4,016కు పెంచింది. ఈ నిర్ణయంతో జగిత్యాల జిల్లాలోని 17,405 మంది దివ్యాంగులకు లబ్ధి చేకూరింది. గత ఆగస్టు నెలకు సంబంధించి రూ.4,016ను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది. దీంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం వివిధ రకాల పింఛన్‌దారులు 2,28,480 మంది ఉన్నారు. వీరిలో వితంతువులు 44,966, వృద్ధులు 63,691, దివ్యాంగులు 17,405, గీత కార్మికులు 3,644, చేనేత కార్మికులు 2,510, ఒంటరి మహిళలు 4,623, బీడి కార్మికులు 89,033, దయాలసిస్ బాధితులు 1,799, కళాకారులు 724 మంది పింఛన్ పొందుతున్నారు.



పెగడపల్లిలో సీఎం కేసీఆర్, మంత్రి ఈశ్వర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు, బీఆర్‌ఎస్ నాయకులు (ఫైల్)

సంతోషంగా ఉంది



ముఖ్యమంత్రి కేసీఆర్ దివ్యాంగుల సమస్యను గుర్తించి, పింఛన్ రూ.4,016కు పెంచడం సంతోషంగా ఉంది. అంగవైకల్యం కారణంగా జీవితం భారంగా గడుపుతున్న సమయంలో ప్రభుత్వం రెండుసార్లు పింఛన్ పెంచి, మాకు అండగా నిలిచింది.

– అడిగొప్పుల నర్సయ్య, పెగడపల్లి

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



దివ్యాంగులకు పింఛన్ పెంచిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ఆగస్టు నెలకు సంబంధించి పెరిగిన పింఛన్ డబ్బులు తీసుకున్న. ఆనందంగా ఉంది. దివ్యాంగుల పాలిట దేవుడు సీఎం కేసీఆర్. ఆయనను మేము ఎప్పటికీ మరిచిపోం.

– తడగొండ సురేశ్ నంచర్ల

సంక్షేమమే ధ్యేయం



అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోంది. పింఛన్లతో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు లబ్ధి చేకూరుతుంది. పేద కుటుంబాలకు చెందిన చాలామంది దివ్యాంగులకు పెన్షన్ పెంపు ఆర్థిక భరోసానిస్తుంది.

– కొప్పుల ఈశ్వర్ సంక్షేమశాఖ మంత్రి

ప్రభుత్వ కాలేజీకి బస్సు నడిపించాలి

సారంగాపూర్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఆర్టీసీ అధికారులు బస్సు నడిపించాలని సారంగాపూర్ మండలంలోని రేచపల్లి, భీంరెడ్డిగూడెం, మ్యాడారంతండా, లచ్చనాయక్‌తండా ప్రజలు కోరుతున్నారు. ఆయా గ్రామాల నుంచి నిత్యం 35 మంది విద్యార్థులు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లి, చదువుకుంటున్నారు. గత విద్యాసంవత్సరంలో ఆర్టీసీ అధికారులు ప్రత్యేకంగా బస్సు నడిపారు. ఈ ఏడాది కూడా నడుపుతారని భావించి, విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఆర్టీసీ అధికారులను గత జూన్‌లో కలిసి, బస్సు నడిపించాలని కోరగా అంగీకరించారు. దీంతో బస్సు వస్తుందని భావించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా రాకపోవడంతో నిరాశ చెందుతున్నారు. బస్సు పాసు తీసుకుంటే నెలకు కేవలం రూ.300 అవుతాయని, ప్రైవేటు వాహనాల్లో వస్తుండటంతో రోజుకు రూ.60 చొప్పున నెలకు రూ.1,800 వరకు ఖర్చవుతోందని అంటున్నారు. విద్యార్థుల సమస్యను గుర్తించి, నాలుగు గ్రామాల నుంచి కళాశాల వద్దకు బస్సు నడిపించాలని కోరుతున్నారు.



ప్రైవేటు వాహనంలో కళాశాల వద్ద దిగుతున్న విద్యార్థినులు

పిడుగుపాటుతో యువకుడి మృతి

సిరిసిల్లఅర్బన్: క్రికెట్ ఆడేందుకు వెళ్లిన యువకుడు పిడుగుపాటుతో మృతిచెందిన సంఘటన సిరిసిల్లలో ఆదివారం విషాదం నింపింది. జిల్లా కేంద్రంలోని బీవైనగర్‌కు చెందిన పడిగె సతీశ్(32) మెకానిక్‌షాప్ నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. స్నేహితులతో కలిసి సిరిసిల్ల మున్సిపల్ పరిధి బోనాలకు క్రికెట్ ఆడేందుకు వెళ్లారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో అక్కడే ఉన్న ఓ చెట్టు కిందికి సతీశ్‌తోపాటు అతని స్నేహితులు తలదాచుకున్నారు. అదే సమయంలో ఆ చెట్టుపై పిడుగు పడగా.. సతీశ్‌తోపాటు అతని స్నేహితులు కుప్పకూలిపోయారు. ఈ సంఘటనలో సతీశ్‌కు తీవ్రగాయాలు కాగా.. సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సతీశ్ అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కాగా మృతుడి అన్న ఏడాది క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు.



సతీశ్ (ఫైల్)

రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

పిడుగుపాటుతో మృతిచెందిన సతీశ్ కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు.

ప్రాణాలు తీసిన అప్పులు

- క్రిమిసంహారక మందుతాగి రైతు,
- ఉరేసుకొని కౌలు రైతు బలవన్మరణం

రామడుగు(చొప్పదండి)/జమ్మికుంట(హుజూరాబాద్): అప్పుల బాధతో మనస్తాపం చెందిన యువ రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. రామడుగు మండలం దేశరాజ్‌పల్లి గ్రామానికి చెందిన రైతు వెల్మల కుమార్(34) క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై తిరుపతి వివరాల ప్రకారం.. కుమార్ తనకున్న రెండెకరాలతో పాటు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకొని పత్తి, వరి పంటలు సాగు చేశాడు. గతంలో కురిసిన వడగండ్ల వర్షంతో వరి పంటకు పూర్తిగా నష్టం వాటిల్లింది. రెండేళ్ల క్రితం అప్పు చేసి ఇల్లు కట్టుకున్నాడు. వ్యవసాయంతో పాటు ఇంటి నిర్మాణానికి దాదాపు రూ.7 లక్షల మేర అప్పు చేశాడు. అప్పు తీర్చే మార్గం లేకపోవడంతో ఈనెల 1న రాత్రి కుటుంబ సభ్యులు ఇంట్లో ఉండగా క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. మృతుడికి భార్య భూమిక, కొడుకు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



కుమార్ (ఫైల్)



రాజు మృతదేహం

విలాసాగర్‌లో కౌలు రైతు..

జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన కౌలు రైతు గరిగంటి రాజు(34) ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజు, రజిత దంపతులు కూలీ పని చేసుకొని జీవనం సాగిస్తున్నారు. గతేడాది ఒక ఎకరం భూమి కౌలుకు తీసుకొని వ్యవసాయం చేశాడు. పంట పండకపోగా రూ.2లక్షల వరకు అప్పులు అయ్యాయి. రాఖీ పండుగ సందర్భంగా భార్య తల్లిగారింటికి వెళ్లింది. ఈక్రమంలో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాజు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

2,011 మంది కుష్ఠు అనుమానితులు

- వారికి స్క్రీనింగ్ చేసేందుకు ప్రణాళిక
- గతేడాది 84 మందిని గుర్తించిన అధికారులు
- జిల్లాలో ముగిసిన వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే



ఇంటింటి సర్వేలో వైద్యాధికారులు, సిబ్బంది

కథలాపూర్(వేములవాడ): కుష్ఠు(లెప్రసీ) అనుమానిత కేసుల గుర్తింపు కోసం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సర్వే ముగిసింది. జిల్లాలోని అన్ని పట్టణాలతోపాటు గ్రామాల్లో ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు బృందాలుగా ఏర్పడి ఇంటింటా పర్యటించారు. గతనెలలో 15 రోజులపాటు ప్రజలను కలిసి వారికి శరీరంపై ఏమైనా మచ్చలు ఉన్నాయా, కణితులు ఉంటే నొప్పి ఉందా? లేదా? అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుష్ఠు రహిత సమాజాన్ని నిర్మించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టింది.

15 రోజులు ఇంటింటా పర్యటన

- జిల్లాలో కుష్ఠు అనుమానితులను గుర్తించేందుకు 744 బృందాలను ఏర్పాటు చేశారు.
- ఈ బృందాలు సుమారు 15 రోజులపాటు ఇంటింటా పర్యటించి 10,08,125 మందిని సర్వే చేశాయి. ఇందులో 2,011 మంది అనుమానితులు ఉన్నట్లు గుర్తించాయి.
- వారిని సమీప ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు పంపించి స్క్రీనింగ్ చేయించనున్నట్లు అధికారులు తెలిపారు.
- విడతలవారీగా నెలరోజుల్లో ఈ ప్రక్రియ పూర్తిచేసి కుష్ఠు నిర్ధారిస్తామని అన్నారు.

చికిత్సా విధానం ఇలా..

కుష్ఠు అనుమానితుల వివరాలు సేకరించాక స్క్రీనింగ్ చేస్తారు. శరీరంపై ఐదు మచ్చల కంటే తక్కువ ఉంటే 6 నెలల పాటు, ఐదు కంటే ఎక్కువ ఉంటే 12 నెలలపాటు ఉచితంగా మందులు, చికిత్స అందిస్తూ వ్యాధి నయం చేస్తారు. ఏటా కుష్ఠు పీడితుల గుర్తింపు కోసం సర్వే చేపట్టడం ద్వారా ముందుగానే అనుమానితులను గుర్తించి ఆరంభంలోనే కట్టడి చేయాలన్నదే లక్ష్యమని వైద్యారోగ్యశాఖ అధికారులు అంటున్నారు.

సేవలను వినియోగించుకోవాలి



జిల్లాలో కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కోసం వైద్యసిబ్బందితో 15 రోజులపాటు ఇంటింటా సర్వే చేయించాం. 2,011 మంది అనుమానితులను గుర్తించాం. వీరికి స్క్రీనింగ్ చేసిన తర్వాత లక్షణాలు బయటపడితే ఉచితంగా చికిత్స, మందులు అందిస్తాం. బాధితులు ఆందోళన చెందకుండా ప్రభుత్వ వైద్యసేవలను వినియోగించుకోవాలి. సక్రమంగా మందులు వాడితే కొన్ని నెలల్లోనే వ్యాధి నయం అవుతుంది.

– శ్రీనివాస్, జిల్లా ఉప వైద్యాధికారి

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

జమ్మికుంట(చొప్పదండి): నిప్పంటించుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కందుకూరి రమాదేవి(45) చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. రమాదేవి పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో తల్లి సుగుణ ఇంట్లో ఉంటోంది. భర్త రామమూర్తి ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. గత నెల 16న తల్లి బంధువుల ఇంటికి వెళ్లగా రమాదేవి కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చుట్టుపక్కల వారు గమనించి వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందింది. రమాదేవి మానసిక స్థితి బాగాలేక ఆత్మహత్యకు పాల్పడిందని ఆదివారం భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రవి తెలిపారు.

జీలకుంటకు చెందిన యువకుడు..

ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీలకుంట గ్రామానికి చెందిన కంది వంశీరెడ్డి (23) పురుగులమందు తాగి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై శ్రీధర్ కథనం ప్రకారం.. వంశీరెడ్డి కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. డబ్బుల కోసం ఈనెల 2న తండ్రితో గొడవపడ్డాడు. తర్వాత పురుగులమందు తాగగా చికిత్సకోసం సుల్తానాబాద్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి తండ్రి సమ్మిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డీసీఎం, కారు ఢీ



డీసీఎం, కారు ఢీకొన్న దృశ్యం

మానకొండూర్: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి తీవ్రగాయాలైనాయి. పోలీసుల వివరాలు.. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన కొందరు ఆదివారం హన్మకొండలో జరిగే వివాహ వేడుకకు కారులో బయలుదేరారు. మానకొండూర్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై డీసీఎం, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ ఆకుదాడి కిరణ్, ఆకుదాడి చరణ్, జోగురు మల్లేశ్, జోగురు చంద్రమొగిలి, జోగురు కళ్యాణి, జోగురు ఆదిదేవ్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మర్తనపేట శివారు ఎల్లమ్మ ఆలయ సమీపంలో పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. పేకాఆడుతున్న సిరిసిల్లకు చెందిన ఐదుగురిని పట్టుకొని, వారి వద్ద నుంచి రూ.7,280 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. అందరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

వేములవాడరూరల్: గంజాయి విక్రయిస్తున్న జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఇద్దరిని వేములవాడ రూరల్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. రూరల్ సీఐ కృష్ణకుమార్ తెలిపిన వివరాలు. జార్ఖండ్‌కు చెందిన రాకేశ్‌కుమార్, కొత్తపల్లి మండలం ఎన్టీయార్ తమిళకాలనీకి చెందిన రాజ్‌కుమార్‌తో కలిసి గంజాయిని విక్రయించేందుకు వేములవాడకు వస్తున్నాడు. ఈక్రమంలో బోయినపల్లి ఎస్ఐ మహేందర్ నర్సింగాపూర్ స్టేజీ వద్ద పట్టుకున్నారు. వారి నుంచి 350 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, రిమాండ్ చేశారు. గ్రామాల్లో గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిద్రలోనే పోయిన ప్రాణం

- గుండెపోటుతో దినసరి కూలీ మృతి
- అంత్యక్రియలకు దాతల సాయం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): చిన్నవయస్సులోనే ఓ దినసరి కూలీ గుండె నిద్రలోనే ఆగిపోయింది. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేటలో తీవ్ర విషాదం నింపగా.. భార్య, కొడుకు రోడ్డున పడ్డారు. అంత్యక్రియలకు డబ్బులు లేకపోవడంతో దాతలు సాయం చేశారు. మండలంలోని నారాయణపూర్‌కు చెందిన ఆవునూరి శివ(32) సిరిసిల్ల లేబర్ అడ్డాపై రోజు కూలీ వెతుక్కుని పనిచేస్తూ..కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం రాత్రి భార్య, కుమారుడితో కలిసి భోజనం చేసి పడుకున్న శివ ఆదివారం ఉదయం భార్య శ్రావణి లేపగా లేవలేదు. నిద్రలోనే గుండెపోటుతో మరణించినట్లు గుర్తించారు. స్వగ్రామంలో సొంతిల్లు లేక ఎల్లారెడ్డిపేటలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. గుంటెడు భూమిలేని ఈ నిరుపేద శివ మృతితో భార్య శ్రావణి, కుమారుడు ప్రణయ్(5) రోడ్డున పడ్డారు. ఈ నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



శివ (ఫైల్)

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన ఆవునూరి శివ మృతిచెందగా.. దహన సంస్కారాలకు దాతలు ఆర్థిక సాయం అందించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య రూ.5వేలు, మొన్నటి వరకు ఇక్కడ ఎస్సైగా పనిచేసి ఖమ్మం జిల్లాకు బదిలీపై వెళ్లిన వెంకటకృష్ణ రూ.5వేల సాయం అందించారు. అలాగే మరి కొందరు మరో రూ.10వేల ఆర్థికసాయం అందించారు. దహన సంస్కారాలకు దాతలు ముందుకొచ్చారు.

దాతలు ఆవునూరి శ్రావణి గూగుల్‌పే 70132 03115 నంబర్‌లో సాయం చేయాలని కోరుతున్నారు.

బిల్లుల కోసం లబ్ధిదారుల నిరసన

చొప్పదండి: మండలంలోని రాగంపేట గ్రామంలో ఇంకుడు గుంతలు నిర్మించుకున్న లబ్ధిదారులకు మూడేళ్లుగా బిల్లులు చెల్లించకపోవడంతో ఆదివారం గ్రామంలోని పోస్టు డబ్బా వద్ద ఉత్తరాలతో నిరసన తెలిపారు. సీఎం కేసీఆర్‌కు పోస్టు ద్వారా ఉత్తరాలు పంపించారు. గ్రామానికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవడంలో వంద శాతం ప్రతిభను చూసి అవార్డు ఇచ్చారని, తమకు బిల్లులు మాత్రం ఇవ్వడం లేదని వాపోయారు. ఇంకుడు గుంతల విభాగంలో తమ గ్రామం 2020లో గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఉత్తమ గ్రామంగా అవార్డు పొందిందని, తమకు మాత్రం బిల్లుల చెల్లింపులో మొండిచేయి చూపుతున్నారని ఆరోపించారు. గ్రామంలో 400 మంది తమ ఇండ్లలో ఇంకుడు గుంతలను నిర్మించుకున్నారని, ఇంకా 100 పైగా గృహాలకు ఇంకుడు గుంతల బిల్లులు రావాల్సి ఉందన్నారు. ఎంపీటీసీ సింగిరెడ్డి కృష్ణారెడ్డి ఆందోళనకు మద్దతు తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖ అధికారుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.



నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

వ్యక్తిపై కత్తితో దాడి

ఇల్లందకుంట(హుజూరాబాద్): ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన ఆదివారం సాయంత్రం మండలంలోని సిరిసేడు గ్రామంలో జరిగింది. గ్రామస్తుల వివరాలు.. సిరిసేడుకు చెందిన గాజుల సదానందంపై అదే గ్రామానికి చెందిన కొంగరి సదానందం కత్తితో దాడి చేశాడు. స్థానికులు వెంటనే జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా, మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఇరువురికీ ఇంటికి వెళ్లే దారి విషయంలో గొడవ జరిగింది. పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ జరుగుతున్న క్రమంలో తీర్పు తనకు అనుకూలంగా రాలేదని కొంగరి సదానందం కత్తితో దాడి చేసినట్లు బాధితుడు తెలిపాడు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



చికిత్స పొందుతున్న బాధితుడు

పిడుగుపాటుకు మహిళకు గాయాలు

గోదావరిఖని(రామగుండం): పిడుగుపాటుకు మహిళకు గాయాలయ్యాయి. భారీ వర్షంతోపాటు పిడుగు పడటంతో స్థానిక ఫైవింక్లయిన్ చౌరస్తా ప్రాంతంలో బజ్జీలు విక్రయించే లక్ష్మికి గాయాలయ్యాయి. చలిపిడుగు పడటంతో వణికిపోయిన లక్ష్మిపై పక్కనే కాగుతున్న వేడినూనె మీద పడి గాయాలపాలైంది. కుటుంబసభ్యులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి తీవ్రంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. అలాగే పిడుగుపాటుకు టీవీలు, సెటాప్ బాక్స్‌లు కాలిపోయాయి.

పరికరాలు దగ్ధం..

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని నుస్తులాపూర్ గ్రామానికి చెందిన కోడముంజ కిష్టయ్య ఇంటిపై ఆదివారం పిడుగు పడింది. ఉదయం 11 గంటల సమయంలో ఒక్కసారిగా ఫస్ట్ ఫ్లోర్‌లో పిడుగు పడడంతో ఇంట్లోని వైరింగ్ మొత్తం కాలిపోయింది. టీవీ, ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్‌తో పాటు ఎలక్ట్రిక్ వస్తువులన్నీ కాలిపోయినట్లు, సుమారు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు. పై ఫ్లోర్ నుంచి పెచ్చులూడి కింద పడగా, అదృష్టవశాత్తు ఎవరికి ప్రాణాపాయం జరుగలేదు. పిడుగు పడిన ఇంటిని సర్పంచ్ రావుల రమేశ్, ఎంపీటీసీ కొత్త తిరుపతిరెడ్డి పరిశీలించి కిష్టయ్యతో మాట్లాడారు.

ఆయన చూపు సజీవం

కోల్‌సిటీ(రామగుండం): ఆయన మరణించినా కళ్లు మాత్రం మరో ఇద్దరి దేహంలో సజీవంగా ఈ లోకాన్ని చూస్తూనే ఉన్నాయి. గోదావరిఖనిలో ఇద్దరు అంధులకు వెలుగులు ప్రసాదించి స్ఫూర్తిగా నిలిచారు ఇప్పలపల్లి లింగస్వామి(53) అనే జీన్స్ పాయింట్ స్పెషలిస్టు టైలర్. గోదావరిఖని శివాజీనగర్‌లో నివాసం ఉండే లింగస్వామి అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం ప్రభుత్వ ఆస్పత్రిలో మృతిచెందాడు. సమాజ హితం కోసం నేత్రాలను ఐ బ్యాంక్‌కు దానం చెయ్యాలని లింగస్వామి కుటుంబ సభ్యులకు బంధువులు, స్నేహితులు నర్సయ్య, గట్ల వెంకట్, బంగారు రాజేశ్వర్‌రావు, మెరుగు చంద్రశేఖర్, సోమాదుల గౌరి, కుమార్ కౌన్సెలింగ్ చేశారు. దీంతో దుఃఖంలో కూడా నేత్రాలను దానం చెయ్యడానికి మృతుని తండ్రి లస్మయ్య, భార్య పద్మ, కుమారుడు శివ కుమార్, కూతురు శివాణి ముందుకు వచ్చారు. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టెక్నీషియన్ ఆరిఫ్ ద్వారా శనివారం రాత్రి నేత్రాలను సేకరించి, హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంకుకు తరలించారు.



లింగస్వామి (ఫైల్)

వరదనీటిలో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు

గోదావరిఖనిటౌన్(రామగుండం): గోదావరిఖనిలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి ఆర్టీసీ బస్సు స్థానిక ఫైవింక్లయిన్ మోరీ ప్రధాన రహదారి వరదనీటిలో చిక్కుకుంది. వెంటనే స్పందించిన గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు, అగ్నిమాపక సిబ్బంది కలిసి బస్సును వరదలో నుంచి ఒడ్డుకు చేర్చారు. బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు.



బస్సును ఒడ్డుకు చేర్చుతున్న పోలీసులు